

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 • కనిష్ఠం : 24.0
5
వనపర్తి
జిల్లా వార్తలు
బుధవారం 11 జూన్ 2025



సంగమేశ్వరం ఆలయంలో పూజలు

- కృష్ణానదిలో మరో ఐదు అడుగుల నీరు చేరితే గర్భగుడిలోకి వరద జలాలు


6


సంగమేశ్వర ఆలయం


డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి


మిథున్‌రెడ్డి


సంజీవ్ ముదిరాజ్


రాజీవ్‌రెడ్డి


నందిమల్ల యాదయ్య

కాంగిరేస్

- ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణను పాక్షికంగా పూర్తిచేసిన కాంగ్రెస్
- తెలంగాణ పీసీసీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకం
- త్వరలో జిల్లా కమిటీలు, కార్యవర్గాల నియామకానికి కసరత్తు
- స్థానిక సంస్థల ఎన్నికల్లోపే పూర్తిచేస్తే గెలుపు సులువవుతుందని ప్లాన్
- జూలైలో ఎన్నికలు నిర్వహిస్తారని ఇప్పటికే పార్టీ కేడర్‌కు సంకేతాలు

రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతుండటంతో పాలనపై పట్టుబిగించిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా కూడా బలోపేతం అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. రాష్ట్ర మంత్రివర్గం తదితర అధికారిక పదవుల్లో సామాజిక నేపథ్యం, పార్టీ విధేయులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగానే పార్టీ పదవుల్లో కూడా దీర్ఘకాలంగా అధిష్ఠానాన్ని నమ్ముకొని ఉన్నవారికి పెద్దపీట వేస్తోంది. మిగిలిపోయిన పార్టీ పదవులన్నింటినీ భర్తీ చేస్తూ దూకుడుగా ఉన్నది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల రేస్‌లో మిగతా పార్టీలకన్నా ముందుండాలని ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా ఇటీవల చేపట్టిన నియామకాల్లో ఉమ్మడి జిల్లా నాయకులను గుర్తించడంతో పార్టీ విస్తరణపై తీవ్రంగా ఫోకస్ పెట్టినట్లు స్పష్టం అవుతోంది.

మహబూబ్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ అటు ప్రభుత్వంలోనూ ఇటు పార్టీలోనూ కార్యక్రమాలపై దూకుడు పెంచుతోంది. దాదాపు సంవత్సరంన్నరగా ఎదురుచూస్తున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణను పాక్షికంగా పూర్తిచేసింది. అనేక సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని మంత్రులను ఎంపిక చేసింది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. నేడో, రేపో శాఖల కేటాయింపు కూడా పూర్తికానుంది. అదే సమయంలో పార్టీ నియామకాలపై కూడా దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నారు. సీఎం అయిన తర్వాత కూడా కొద్దిరోజులు అలాగే కొనసాగినప్పటికీ టీపీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను నియమించింది. కానీ కార్యవర్గం ఎన్నికల ముందు నుంచి ఉన్నదే కొనసాగుతూ వచ్చింది. పార్టీ పదవులపై దృష్టి సారించిన అధిష్ఠానం సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకాలను పూర్తిచేసింది. ఇందులో కూడా ప్రతీ జిల్లాకు ప్రాతినిధ్యం ఉండే విధంగా చూసుకున్నది. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూలు నుంచి ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు, జనరల్ సెక్రటరీలుగా మహబూబ్‌నగర్ నుంచి మిథున్‌రెడ్డి, సంజీవ్ ముదిరాజ్‌లకు, నారాయణపేట నుంచి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి, వనపర్తి నుంచి నందిమల్ల యాదయ్యకు, గద్వాల నుంచి రాజీవ్‌రెడ్డికి అవకాశం కల్పించింది. అంతకు కొద్దిరోజుల ముందే పార్టీ క్రమశిక్షణ కమిటీని, పార్టీ సలహా కమిటీ, డీలిమిటేషన్ కమిటీ, సంవిధాన్ బచావో కమిటీలను ఏర్పాటు చేసింది. డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డికి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లు రవికి, సలహా కమిటీ సభ్యుడిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి అవకాశం కల్పించింది. సంవిధాన్ బచావో కమిటీ మినహా మిగతా మూడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నాయకులకు స్థానం లభించింది. ఇంకా వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం చేపట్టాల్సి ఉంది.



ఇక డీసీసీల విస్తరణ..

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినప్పటికీ ఇంకా పాత డీసీసీ కార్యవర్గాలే నడుస్తున్నాయి. కొత్తగా కార్యవర్గాలను ఎన్నుకోవాల్సి

(మిగతా 6లో..)


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న గద్వాల మార్కెట్

నేడు ఏరువాక పౌర్ణమి

- సందడిగా మారిన గద్వాలలోని దుకాణాలు

గద్వాల టౌన్/అయిజ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు సంబురంగా జరుపుకునే ఏరువాక పండుగను పురస్కరించుకుని మంగళవారం గద్వాల పట్టణంలో సందడి నెలకొంది. పండుగ సరకులు కొనేవారితో దుకాణాలు కిటకిటలాడాయి. గ్రామాల్లో కాడెద్దులను ఊరేగించడం ఏరువాక పండుగ ప్రత్యేకత కావడంతో తమ కాడెద్దులను అలంకరించేందుకు పూలదండలు, ఇతర వ్యవసాయ సంబంధ పనిముట్లు కొనేవారితో మార్కెట్ అంతా సందడిగా మారింది. ప్రతీ రైతు తప్పనిసరిగా జరుపుకునే పండుగల్లో ఏరువాక మొదటిది కావడంతో ఇళ్లకు తోరణాలు, పూల దండలు కట్టుకునేందుకు మామిడి ఆకులు, బంతిపూల కొనుగోలు చేసేందుకు జనం గుమికూడటంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి.



గద్వాల పట్టణంలో మామిడి ఆకు, పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఉన్నతాధికారులకు ఆర్టిజన్ల ఊడిగం

- సొంత పనులు చేయించుకుంటున్న డీఈలు, సీఈలు
- ఐదేళ్లుగా కొనసాగుతున్న చాకిరీ
- ఈగలపెంట జెన్‌కో అధికారుల తీరుపై విమర్శలు
- ఎదురు చెప్పలేక నలిగిపోతున్న మహిళా ఆర్టిజన్లు


ఈగలపెంట జెన్‌కో ఈఈ కార్యాలయం

దోమలపెంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం, ఈగలపెంట జెన్‌కో కార్యాలయంలో పని చేయాల్సిన ఆర్టిజన్లతో జెన్‌కో ఉన్నతాధికారులు వారి సొంత పనులు చేయించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. గతంలో క్యాజువల్ లేబర్‌గా (సీఎల్) పనిచేసే వారు. 20 ఏళ్ల పోరాటంతో 2018లో వీరిని ఆర్టిజన్లుగా గుర్తించారు. కానీ కొందరు జెన్‌కో ఉన్నతాధికారులు కొంత మంది మహిళా ఆర్టిజన్లతో వారి ఇళ్లల్లో వంట పని చేయిస్తున్నారు. కొందరైతే పూర్తిగా డ్యూటీ చేయకుండా వారి ఇంటి పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరికొంత మంది అధికారులు వారి ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు పట్టణ ప్రాంతాలకు వారం రోజులపాటు ఆర్టిజన్లను తీసుకెళ్తూ.. నిత్యం విధుల్లో ఉన్నట్టుగా హాజరు వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంతే కాకుండా పురుషులను కూడా డ్యూటీలో చేయాల్సిన పనులు కాకుండా అధికారులు సొంత పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.


ఆర్టిజన్లు చేయాల్సిన పనులు..

ఈగలపెంట జెన్‌కో సంస్థలో 150 మంది వరకు ఆర్టిజన్లు పని చేస్తున్నారు. ఇందులో 50 మంది వరకు మహిళలు ఉన్నారు. ఇందులో కొందరు ఈగలపెంట జెన్‌కో కాలనీ, జెన్‌కో కార్యాలయంలో పని చేస్తున్నారు. జెన్‌కో ఉద్యోగుల కాలనీలో శుభ్రపరుచటం, పిచ్చి మొక్కల తొలగింపు తదితర పనులు చేయాలి. మరికొందరు అధికారుల కార్యాలయాల్లో సహాయకులుగా ఉండాలి, పురుషులు కాలనీలలో పెరిగిన చెట్ల కొమ్మలు నరకటం, విద్యుత్ కేంద్రంలో సాంకేతిక పనులకు చేదోడువాదోడుగా ఉండాలి.. కానీ కొందరు అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

నాకు తెలియదు..

ఆర్టిజన్లు ఉన్నతాధికారుల ఇళ్లల్లో పని చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఈగలపెంట జెన్‌కో సివిల్ ఎస్‌ఈ రవీంద్రకుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా... ఆర్టిజన్లు ఏ ఇంజనీరు ఇంట్లో పని చేసేది నాకు తెల్వదు. మీకు నాతో ఎంపని, నేను ఏమీ చేప్పలేను అంటూ ఫోన్ కట్ చేశారు.

నల్లమలలో చిరుత


నిజాం బంగ్లా సమీపంలో రోడ్డు దాటుతున్న చిరుత

మన్ననూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అభయారణ్యంలో సఫారీ టూర్‌లో ఉన్న పర్యాటకులకు మంగళవారం చిరుతపులి దర్శనమిచ్చింది. మన్ననూరు నుంచి మంగళవారం ఉదయం సఫారీ వాహనంలో పర్హాబాద్ చౌరస్తా మీదేగా వ్యూపాయింట్‌కు వెళ్తున్న పర్యాటకులకు మల్లాపూర్ నిజాం షికారు బంగ్లా వద్ద రోడ్డును దాటుతూ చిరుత పులి కనిపించింది. వాహనంలోని ఓ పర్యాటకుడు తన కెమెరాలో చిరుత దృశ్యాలను చిత్రీకరించారు. చిరుత వయసు 9 ఏళ్ల ఉండవచ్చునని అటవీ సెక్షన్ అధికారి శ్రీకాంత్ ధ్రువీకరించారు.

నిధులు దారి మళ్లిస్తే కఠిన చర్యలు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వచ్చే నిధులను ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి మాత్రమే కేటాయించాలని, ఏదైనా శాఖ ద్వారా సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లిస్తే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ఎస్సీ, ఎస్టీలకు రావాల్సిన నిధులు, వాటాలు ఖచ్చితంగా వారికే అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు వనపర్తి జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంఘం నాయకులతో చైర్మన్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ చైర్మన్ ఐడీవోసీకి చేరుకోగానే ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన సమీక్షలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన వాటా దక్కిందా లేదా అనే వివరాలు ఆరా తీశారు. ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవం విధిగా నిర్వహించాలని సూచించారు. దానికి సంబంధించిన ఒక సంవత్సరం ప్రణాళిక ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులకు మీడియా వాళ్లకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. పౌర హక్కుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు వాటిని ఏ విధంగా పొందవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ అధ్యక్షతన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం తప్పకుండా నిర్వహించాలని, లేకుంటే ఎస్సీ కార్పొరేషన్ అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో క్రిమినల్ కేసుల సంఖ్య ఇతర జిల్లాలతో పోల్చుకుంటే చాలా తక్కువ ఉందన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లల్లో 1,300 ఇళ్లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినట్లు తెలిపారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో 2023 సంవత్సరంలో 19 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా 18 ఛార్జిషీట్లు ఫైల్ చేయడం జరిగిందన్నారు. 2024లో ఎస్సీ 32, ఎస్టీ 8, వెరసి 40 కేసులకు గాను 36 ఛార్జిషీటు నమోదు చేయడం జరిగిందన్నారు. 2025లో 7 ఎస్సీ, 2 ఎస్టీ వెరసి 9 కేసులు నమోదు అయ్యాయని 5 ఛార్జిషీట్ చేసి 2 విచారణలో ఉన్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, నీలదేవి, రాంబాబు పాల్గొన్నారు.

మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్యకర్తల సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రపంచంలో 10వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం 4వ స్థానంలోకి తీసుకు వచ్చిందన్నారు. పహెల్గాం దాడి తర్వాత పాక్ ఉగ్ర స్థావరాలను మట్టి కరిపించిందన్నారు. భారత ప్రభుత్వం పాకిస్తాన్ ప్రజలపై దాడి చేయలేదని, ఆక్కడి ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేసి లక్ష్యం సాధించిందన్నారు. మోదీ ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దేశంలోని కాంగ్రెస్, కమ్యునిస్టులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేటికీ తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. ఏడాదిలో పూర్తి చేస్తామన్న ఎస్‌ఎల్‌బీసీ ఇంకా మూడేళ్లు అయినా పూర్తి కాదని విమర్శించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ నాయకుడు భరత్‌ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణలో .. రికార్డు బ్రేక్

- గత ఏడాది యాసంగి కంటే రెండింతలు
- ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు
- నేటికీ 2 లక్షల 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాలలో జమ చేసిన రూ.504 కోట్లు
- బోనస్ కోసం ఎదురు చూపులు

7



వనపర్తి మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

యాసంగి ధాన్యం సేకరణలో వనపర్తి జిల్లా రికార్డును బ్రేక్ చేసింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యాసంగిలో సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడి కూడా మంచిగా రావడం, ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తింది. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే రెండింతల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 40వేల మంది రైతులకు గాను రూ.504 కోట్లు వారి ఖాతాలో జమ చేశారు.

- వనపర్తి, ఆంధ్రజ్యోతి

సీడ్ వ్యవస్థపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి

- విత్తన కంపెనీల మోసాలపై రైతు కమిషన్ రాష్ట్ర చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన నడిగడ్డ రైతులు


రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసిన సీడ్ పత్తి రైతులు

గద్వాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి) నడిగడ్డలో సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్ల దోపిడీతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని సీడ్‌పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసిన రైతులు సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు చేస్తున్న మోసాలను వివరించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీడ్ పత్తి రైతులు మాట్లాడుతూ.. నడిగడ్డలో దాదాపు 35వేల నుంచి 40వేల ఎకరాలలో సీడ్‌పత్తి సాగుచేస్తున్నామని, కంపెనీలు నేరుగా విత్తనాలు ఇవ్వకుండా సీడ్ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్ల ద్వారా ఇచ్చి వ్యాపారం చేస్తున్నాయని వివరించారు. మేము పండించిన విత్తనాలు తీసుకెళ్లి జీవోటీ టెస్టు చేసి పాస్ అయినా.. ఫెయిల్ అయ్యాయని చెప్పి మా కుటుంబాలను అప్పులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, వ్యవసాయశాఖ సీడ్ వ్యవస్థపై దృష్టి సారించాలని కోరారు. కేటీఆర్ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడి సీడ్ పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైతు కమిషన్‌ను కలిసిన వారిలో రైతులు ముద్ద తిమ్మప్ప, నర్సింహులు, గుడిసె ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, డోలు కృష్ణ, శివ, డీకే ఆంజనేయులు, అంజి, గోవిందు, రాజు ఉన్నారు.

రైతులు విడుదలయ్యే వరకు పండుగలు జరుపుకోం


పెద్ద ధన్వాడలో సమావేశమైన గ్రామస్తులు

6

బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు


రచ్చకట్ట పై మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

» ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, జూన్10 (ఆంధ్రజ్యోతి):బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతోందని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలంలోని గూడెం, బెక్కెం, అమ్మాయిపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గూడెం గ్రామంలోని జములమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. రచ్చకట్ట వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ విశిష్టతను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ని 123 గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటు కోసం రూ. 1.23 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే క్రీడారంగ అభివృద్ధి కోసం మరో రూ.1.23 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి బస్సు సమస్య ఉందని చెప్పడంతో డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జములమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళా భక్తులతో మాట్లాడి గుగ్గిళ్ల ప్రసాదం స్వీకరించారు. అక్కడి నుంచి బెక్కెం గ్రామానికి చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత అమ్మాయిపల్లికి చేరుకున్న ఆయన గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టులో 55 టీఎంసీల నీటి నిల్వ

దోమలపెంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదనతో 15,561 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా, సుంకేసుల నుంచి వరద నీరు నిల్చిపోయింది. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు నీటి నిల్వలు ఇలా... ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 835.50 అడుగులకు చేరగా, 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 55.7729 టీఎంసీల నీటి నిల్వలు నమోదు అవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను నిలిపివేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 1,583 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 0.768 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించగా, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 3,605 క్యూసెక్కుల నీటిని వినియోగించి 1.669 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 5,470 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదనతో దిగువకు వదిలినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా గజలమ్మ జాతర


పేట గజలమ్మ ఆలయంలో ఎమ్మెల్యేకు పూలమొక్కను అందించి సత్కరిస్తూ


నాటుకోళ్లతో యువకుడు

» బోనాలు సమర్పించిన మహిళలు
» అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో గజలమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భక్తులు, మహిళలు తమ ఇళ్లలో ప్రత్యేక వంటకాలతో బోనాలను సిద్ధం చేసుకొని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు మహిళలు పట్టణంలో బోనాలతో ఊరేగింపు నిర్వహించుకున్నారు.

అనంతరం గజలమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, పోషల్ రాజేశ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, వెంకుగౌడ్, కురువ మనోజ్, సిద్ధం లక్ష్మణ్, గొల్ల లక్ష్మణ్, వీరేశ్, జరంగ్‌రాము, మసి పవన్, గడ్డం వినోద్, కార్తీక్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగి'రేస్'

(5వ పేజీ తరువాయి)

ఉన్నా టీపీసీసీ కార్యవర్గం ఎన్నిక కావాలని ఎదురుచూశారు. ఇప్పుడు ఆ అంశం కూడా కొలిక్కి వస్తుండటంతో డీసీసీలను కూడా విస్తరిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షులుగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వ్యవహిస్తుండగా నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు మాత్రం ఎన్నికల తర్వాత మారారు. అప్పటివరకు ఉన్న అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొంది డీసీసీ అధ్యక్ష పదవిని వదులుకోవడంతో ప్రశాంత్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వనపర్తిలో అప్పటి నుంచి రాజేంద్రప్రసాద్ యాదవ్ డీసీసీ అధ్యక్షులుగా కొనసాగుతుండగా నాగర్‌కర్నూలు డీసీసీ అధ్యక్ష పదవిలో ఇంకా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణనే కొనసాగుతున్నారు. ఇప్పుడు వంశీకృష్ణకు టీపీసీసీ ఉపాధ్యక్ష పదవి రావడంతో అనివార్యంగా డీసీసీ భర్తీ చేయాలి. గద్వాల డీసీసీకి అధ్యక్షుడే లేరు. ఎన్నికల సమయంలో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పటేల్ ప్రభాకర్‌రెడ్డి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉన్నది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ జిల్లా బాధ్యతలను తాత్కాలికంగా చూస్తున్నారు. అయితే ప్రస్తుతం మహబూబ్‌నగర్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేష్, సిరాజ్ ఖాద్రి తదితరులు డీసీసీ కోసం పోటీపడుతుండగా నారాయణపేటలో ప్రస్తుత అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఆశిస్తున్నారు. గద్వాల నుంచి గడ్డం కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ఇసాక్ అధ్యక్ష పదవిని కోరుతున్నారు. వనపర్తి నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, చీర్ల చందర్, శంకర్‌నాయక్, బ్రహ్మాచారి, వెంకటేష్, తిరుపతయ్య, బాలస్వామి, రాజేంద్రప్రసాద్ ఆశిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లోపే...

స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి చాలాకాలం అవుతోంది. సర్పంచులది సంవత్సరంన్నర, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలది సంవత్సరం, మునిసిపాలిటీలది సుమారు ఆరు నెలల సమయం అవుతోంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అనివార్యంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ విస్తరణపై దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు వచ్చేలోపే పార్టీ విస్తరణ పూర్తిచేయాలని భావిస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఏర్పడ్డ కొంత అనిశ్చితి కాళేశ్వరం కమిషన్, ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాలపై రోజూ తెరపై కనిపిస్తుండటంతో ఇదే అదనుగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని పార్టీ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. పార్టీ పదవులు, స్థానిక సంస్థల్లో టిక్కెట్ల అంశంపైనే సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ పెద్దలతో చర్చలు జరపడం వంటివి బలం చేకూరుస్తున్నాయి.

డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

కల్వకుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో డబుల్‌బెడ్రూం కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని డబుల్‌బెడ్రూం డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా ఎలాంటి స్పందనా లేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, సహాయ కార్యదర్శి పద్మ, యాదయ్య, సుభాన్, బాలకృష్ణ, వెంకటేశ్, కృపయ్య, కిరణ్‌చారి, వినయ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఐక్యత చాటాలి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


పదరలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

పదర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీల ఐక్యత చాటి చూపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామిని మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశమై మాట్లాడారు. జనాభా శాతం ప్రకారం బీసీ హక్కుల సాధనకు రాజకీయ చైతన్యంతో పాటు ఐక్యత అవసరమని సూచించారు. సమావేశంలో నాయకులు గోలి శ్రీను, ప్రశాంత్ చారి, ప్రవీణ్, బాలాజీ, రేణు, శ్రీనివాసులు, జగపతి, నీరంజన్, సైదులు, సురేశ్, రాయశ్రీను, చందు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో పూజలు


సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటున్న భక్తులు

» కృష్ణానదిలో మరో ఐదు అడుగుల నీరు చేరితే ఆలయం గర్భాలయంలోకి వరద జలాలు
» చివరిసారి వేపదార శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కొల్లాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్యదైవంగా పూజించే సప్త నదుల సంగమక్షేత్రం సంగమేశ్వర ఆలయం మరో 15 రోజుల్లో పూర్తిగా జలధివాసం కానుంది. దీంతో తెలుగు రాష్ట్రాల భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి చివరిసారి ఆలయంలో వేపదార శివలింగాన్ని దర్శించుకున్నారు. మృగశిర కార్తె రావడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పాటు వర్షాలు ఎక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ పరిశీలకులు హెచ్చరించడంతో శ్రీశైల జలాశయంలో ప్రస్తుతం 835 అడుగులు వరద జలాలు చేరడంతో భక్తులు చివరిసారిగా ఆలయాన్ని సందర్శిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు చలువ పందిళ్లను మంగళవారం తొలగించారు. సంగమేశ్వరం ఆలయం కృష్ణానదిలో జలధివాసమైతే మరో ఆరు నెలల తరువాత భక్తులకు ఆలయం దర్శనం కానుంది. భక్తులు, పర్యాటకులు సోమశిల గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి మరబోటు ద్వారా సిద్దేశ్వరం వెళ్లి అటుగా బోటుపై సప్త నదుల సంగమ క్షేత్రాన్ని దర్శించుకుంటున్నారు.

లింగమయ్య స్వామికి దండాలు

» భక్తిశ్రద్ధలతో బండారు ఉత్సవం

మక్తల్ రూరల్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని కర్ని, రుద్రసముద్రం గ్రామాల్లో మంగళవారం లింగమయ్య స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తులు కాగులను తలపై పెట్టుకొని మేళ తాళాలతో స్వామివారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామికి ప్రీతిపాత్రమైన బండారు (పసుపు) చల్లుకున్నారు. ఉత్సవాలకు చుట్టుపక్క గ్రామాల నుంచి వేలాది మంది తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా కర్నిలోని లింగమయ్య స్వామిని బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్న రంగప్ప, నారాయణరెడ్డి, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

» టీఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మా


ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయం గేటు ముందు ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

వనపర్తి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మా డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణంలో మంగళవారం మత్స్యకార్మికులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు వృత్తి రక్షణ చట్టం చేయాలని, 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మిక సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అదే విధంగా డీఎఫ్‌సీఎస్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఉన్న జిల్లా అడహక్ కమిటీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మేకల సురేంద్రబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, వనపర్తి సొసైటీ అధ్యక్షుడు బొలమోని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, రంగాపురం సొసైటీ అధ్యక్షుడు కటికల నరసింహ, కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా నాయకుడు మొగిలి, సహాయ కార్యదర్శి మహేశ్, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

» సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు బి.వెంకట్


క్లాసు బోధిస్తున్న సీపీయం జాతీయ కమిటి సభ్యులు బి.వెంకట్

పాలమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీ, మెజారిటీ మతోన్మాదాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు మంగళవారం ఆయన హాజరయ్యారు. 'మతం - మతోన్మాదం' అంశంపై బోధించారు. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలైన తరువాత ప్రజల్లో అసమానతలు తీవ్రమయ్యాయన్నారు. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించి పాలక వర్గాలు, కార్పొరేట్లు కలిసి ప్రభుత్వాలను నడుపుతున్నాయని ఆరోపించారు. మతాన్ని, రాజకీయాన్ని కలగాపులగం చేసి మూఢ నమ్మకాలను వ్యాప్తి చేస్తున్నారని విమర్శించారు. ఇవి ప్రజా ఉద్యమాలకు తీవ్ర ఆటంకంగా మారాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు మాట్లాడుతూ జిల్లాలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, వి.పద్మ, లక్ష్మయ్య, ఆర్.రాంరెడ్డి, దీప్లానాయక్, కె.మోహన్, ప్రశాంత్, భరత్, అనురాధ, చంద్రమ్మ, చంద్రకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో తల్లి.. బస్టాండులో కుమారుడు!

» గుర్తించి తల్లికి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది


జడ్చర్ల కొత్తబస్టాండులో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

జడ్చర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తల్లితో పాటూ బస్సు ఎక్కకుండా బస్టాండ్‌లో ఒంటరిగా నిలిచిపోయిన బాలుడిని ఆర్టీసీ సిబ్బంది గుర్తించి, ఆమెకు అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలో ఈ సంఘటన జరిగింది. ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన పద్మ మంగళవారం తన ఇద్దరు కుమారులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. వనపర్తిలో ఆర్టీసీ బస్సు ఎక్కిన ఆమె టాయిలెట్‌కు వెళ్లేందుకు జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో దిగింది. ఆ తర్వాత మళ్లీ బస్సు ఎక్కింది. ఆమె వెంటనే చిన్న కుమారుడు బస్సు ఎక్కగా, పెద్ద కుమారుడు బస్టాండ్‌లోనే నిలిచిపోయాడు. బస్సు రాజాపూర్ సమీపంలో ఉండగా పెద్ద కుమారుడు తన వెంట లేడని గుర్తించింది. అదే సమయంలో జడ్చర్ల కొత్తబస్టాండులో బాలుడు ఒంటరిగా ఉండడాన్ని సెక్యూరిటీ లింగంపేట నర్సింహులు గమనించారు. స్టేషన్ మేనేజర్ జయరాజు, ఏడీసీ నర్సిములు, ట్రాఫిక్ గైడ్ శివరాములు, వెంకటయ్యలకు సమాచారం అందించారు. వారు బాలుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌లకు ఫోన్ చేసి పద్మను మళ్లీ జడ్చర్లకు రప్పించారు. పూర్తి వివరాలు తెలుసుకొని బాలుడిని ఆమెకు అప్పగించారు. తన కుమారుడిని క్షేమంగా అప్పగించినందుకు ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు విడుదలయ్యే వరకు పండుగలు చేసుకోం

» ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు పోరాటం
» పెద్ద ధన్వాడ గ్రామస్థుల తీర్మానం

రాజోలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జైలులో ఉన్న రైతులు విడుదలయ్యే వరకు ఏ పండుగలనూ చేసుకోబోమని జోగుళాంబ గద్వాల జిల్లా, పెద్ద ధన్వాడ గ్రామస్థులు తీర్మానించుకున్నారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో కేసులు నమోదై, గ్రామానికి చెందిన పలువురు జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు ఏరువాక పౌర్ణమి పండుగను కూడా వారు చేసుకోలేదు. గ్రామ పెద్దలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు.

తమ గ్రామానికి చెందిన వారు జైలులో ఉండగా, తాము ఏరువాక వేడుకలను ఎలా చేసుకుంటామన్నారు. ఇథనాల్ పరిశ్రమ రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
» రైల్వే శాఖ మంత్రికి వినతి


రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను వెంటనే పూర్తి చేయాలని పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కోరారు. ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మంగళవారం ఆమె కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గ పరిధిలోని కృష్ణ - వికారాబాద్ రైల్వే లైన్ ప్రాజెక్ట్ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

» రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్


కేవీపీఎస్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్

కొల్లాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దళితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో జరుగుతున్న కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నేటికీ గ్రామాల్లో అంటరానితనం, కుల వివక్ష కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ప్రతీ నెల 30వ తేదీన నిర్వహించాల్సిన పౌర హక్కుల దినం ఎక్కడానిర్వహించడం లేదని పేర్కొన్నారు. గ్రామాలలో దళితులపై దాడులు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం చట్టరీత్యా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశన్న, పరశురాములు, ఉపాధ్యక్షులు హనుమంత్, రాజు అశోక్, సహాయ కార్యదర్శులు మల్లేష్, అశోక్, మహిళా కన్వీనర్ స్వాతి, ఆవాజ్ జిల్లా కన్వీనర్ సలీం, రైతు సంఘం నాయకులు బాలపీరు పాల్గొన్నారు.

పంటలో అధిక దిగుబడి పద్ధతులపై అవగాహన

» డాక్టర్ టీ ప్రభాకర్‌రెడ్డి ప్రోగ్రాం కో ఆర్డినేటర్


అధిక దిగుబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత ప్రభాకర్‌రెడ్డి

ఉప్పునుంతల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం శాస్త్రవేతల బృందం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీ ప్రభాకర్‌రెడ్డి పంటలలో అధిక దిగుబడి పొందే పద్ధతులు, పంట పొలాల్లో ఎరువులు యాజమాన్యం, పోషక యాజమాన్యం, సాగునీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడితో వచ్చే లాభాలు ఉద్యాన, కూరగాయలపై డాక్టర్ శైల వివరించారు. పంటల్లో సమగ్ర చీడపీడలు, విత్తనాల కొనుగోల, పురుగు మందుల కొనుగోలు, రశీదు, వినియోగంపై డాక్టర్ రాజశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవేష్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

పీయూ పూర్వ విద్యార్థి ప్రతిభ

» పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 11వ ర్యాంకు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పీయూ పూర్వ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉస్మానియా యూనివర్సిటీ మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో పాలమూరు యూనివర్సిటీ కామర్స్ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థిని విశాల రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు సాధించింది. ఎంబీఏ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థిని దివ్యశ్రీ 230వ ర్యాంక్ సాధించింది. వారికి వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

సంపులో పడి మహిళ మృతి

కల్వకుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న సంపులో పడి ఓ మహిళ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గచ్చుబావి సమీపంలో నివసిస్తున్న బాలమ్మ మంగళవారం ఉదయం ఇంటి ముందున్న సంపులో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మునిగిపోయింది. ఆ సమయంలో ఆమె ఒంటరిగా ఉండటంతో ఎవరూ గుర్తించలేదు. వేరే ఇంట్లో నివసించే ఆమె కొడుకు అంజనేయులు తల్లి కన్పించకపోవడంతో బస్టాండ్, తదితర ప్రాంతాల్లో వెతికారు. మనుమరాలు అంజలి, పద్మలు బాలమ్మ అనుమానంతో ఇంటి ముందున్న సంపులో చూడగా బాలమ్మ మృతదేహం కనిపించింది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

విద్యుదాఘాతంతో మేస్త్రి..

జడ్చర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ టైల్స్ మేస్త్రీ మృతి చెందాడు. జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటకు చెందిన వెంకటయ్య (48) టైల్స్ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అతడు గోప్లాపూర్ గ్రామంలో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో టైల్స్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స కోసం జడ్చర్ల వంద పడకల ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని కౌన్సిలర్ బుక్కమహేశ్, బీఆర్ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మేస్త్రీ వాడ్యాల వెంకటయ్య పరామర్శించారు.

బావిలో పడి యువకుడి ఆత్మహత్య


నరేందర్ (ఫైల్)

వనపర్తి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బావిలో పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వనపర్తి జిల్లా, మండలం అప్పాయిపల్లి శివారులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నరేందర్ (25) వనపర్తి పట్టణంలోని మర్రికుంటలో గల మణికుమార్ వాటర్ ప్లాంట్‌లో ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగిసిన తర్వాత, స్వగ్రామం తిరుమలాపూర్‌కు వెళ్తున్నానని యజమానికి చెప్పి ఆటోలో బయలుదేరాడు. ఆ తర్వాత అతడి ఆటో ఒక బావి దగ్గర నిలిపి ఉండగా, స్థానికులు గమనించి తండ్రి చిన్నయ్యకు సమాచారం అందించారు. దీంతో అతడు అక్కడికి చేరుకొని చుట్టు పక్కల వెతికినా నరేందర్ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మళ్లీ బావి దగ్గరికి వెళ్లి పరిశీలించాడు. అక్కడ కుమారుడికి సంబంధించిన మొబైల్ టార్చ్ లైట్, చెప్పులు కనిపించాయి. వెంటనే రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బావిలో గాలించి మృతదేహన్ని వెలికి తీసి, జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరి మీదా అనుమానం లేదని తండ్రి చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి మృతితో మనోవేదన

▸ కుమారుడి బలవన్మరణం

వడ్డేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మృతి చెందడంతో మనోవేదనకు గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్డేపల్లి ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మునిసిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లోని రామచంద్రనగర్ కాలనీకి చెందిన అమర్నాథ్ (43) తండ్రి గత నెల 29న మృతి చెందాడు. దీంతో తీవ్ర మనో వేదనకు గురైన అతడు సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అక్కడి చేరకున్న వారు అమర్నాథ్‌ను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ విషయంపై మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వనపర్తి జిల్లా ఏదుల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. గోపాల్‌పేట ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గుణముని రాములు (40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతడు భార్య రేణుకతో డబ్బుల విషయంలో గొడవపడ్డాడు. క్షణికావేశంలో తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి భార్యకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. రాములుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

భూమి కబ్జాతో మనస్తాపం

▸ వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కేటీదొడ్డి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తన భూమి కబ్జాకు గురికావడంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ముచ్చు సవారప్ప, బంగారప్ప అన్నదమ్ములు. వారికి ఉమిత్యాల గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. వారి పొలం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని బస్సాపురం గ్రామానికి చెందిన నీళ్ళబాయి అంజనేయులు కబ్జా చేస్తున్నాడని గతంలో వారు తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నీళ్ళబాయి అంజనేయులు సోమవారం రాత్రి ప్రభుత్వ భూమితో పాటు, బాధితులకు సంబంధించిన భూమిని కూడా ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. దీంతో మనస్తాపానికి గురైన బంగారప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై బాధితుడి కుమారుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తగ్గిన జల విద్యుత్ ఉత్పత్తి


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వరద స్వల్పంగా వస్తున్నందున జల విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు నాలుగు రోజుల నుంచి 5 వేల క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోందని తెలిపారు. దీంతో మూడు రోజుల క్రితం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టుకు ఎగువ నుంచి 20 వేల క్యూసెక్కుల వరద వస్తున్నందున ఎగువ జూరాల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లను ప్రారంభించి 0.840 మిలియన్ యూనిట్లు, దిగువ విద్యుత్ కేంద్రంలో 0.964 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఎగువ నుంచి వచ్చే వరద ఆధారంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచే అవకాశం ఉందని వివరించారు.

దివ్యాగులకు ఉజ్వల 'భవిత'

▸ భవిత కేంద్రాలకు ప్రత్యేక నిధులు మంజూరు
▸ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి
▸ ప్రశస్త యాప్‌లో వివరాల నమోదు


ఖిల్లాఘణపురం భవిత సెంటర్‌లో సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థికి వస్తువుల పట్ల అవగాహన కల్పిస్తున్న ఐఈఆర్‌పీ రజిత


దివ్యాంగ విద్యార్థి ఇంటి దగ్గర సామార్థ్యాలను పెంపుదలకు కృషి చేస్తున్న ఐఈఆర్‌పీ

ఖిల్లాఘణపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగంలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. అందులో భాగంగా భవిత కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. భవిత కేంద్రాల్లో మానసిక దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల (చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్) సామర్థ్యాల పెంపునకు ఐఈఆర్‌పీలు నిరంతరం కృషి చేస్తున్నారు. భవిత కేంద్రాలకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)తో పాటు భవనాల మరమ్మతులకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు.

వనపర్తి జిల్లాలో 14 భవిత కేంద్రాలు

వనపర్తి జిల్లాలో ఖిల్లాఘణపురం, కొత్తకోట, వనపర్తి మండల కేంద్రాల్లోని 3 భవిత సెంటర్లకు శాశ్వత భవనాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానంగా మరో 11, మొత్తంగా జిల్లాలో 14 భవిత కేంద్రాలున్నాయి. 16 మంది ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ పర్సన్)లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. వారు ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల మానసిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు, సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యార్జన చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల కోసం ప్రశస్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని 14 భవిత కేంద్రాల్లో 1,932 మంది పేర్లను ఈ యాప్‌లో నమోదు చేశారు. ఖిల్లాఘణపురం మండలంలో ప్రశస్త యాప్ ద్వారా 98 మంది విద్యార్థులను గుర్తించి నమోదు చేశారు.

నిపుణులతో వైద్య సేవలు

ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు భవిత కేంద్రాల్లో నిర్ధారిత రోజుల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. నడవడానికి ఇబ్బంది పడుతున్న వారికి ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. ఐఈఆర్‌పీలు ప్రతీ శనివారం వారి ఇళ్లకు వెళ్తున్నారు. మనోధైర్యాన్ని నింపుతూ శిక్షణ ఇస్తున్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజు మానసిక దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు బహుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. వారిలో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతీ కేంద్రానికి రూ. 2 లక్షలు

వనపర్తి జిల్లాలో శాశ్వత భవనాలున్న 3 భవిత కేంద్రాలకు బోధన సామగ్రితో పాటు అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ. 2 లక్షల చొప్పున రూ. 6 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో జిల్లా విద్యాధికారి సూచనల మేరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, భవిత కేంద్రం నిర్వాహకులతో కూడిన కమిటీ పరికరాలను కొనుగోలు చేసింది. ఆయా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచింది.


ఖిల్లాఘణపురంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎంఈవో జయశంకర్ (ఫైల్)

మరిన్ని సేవలు అందిస్తాం



దివ్యాంగ విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నాం. వారికి ప్రత్యేక బోధన అందించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. భవిత కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తే మరింత మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తాం.

- ఆనంద్, ఐఈఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

ప్రత్యేక విద్యను అందించడమే లక్ష్యం



విశిష్ట ప్రతిభావంతులైన దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టీఎల్ఎం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా శారీరక, మానసిక ఇబ్బందులను తొలగిస్తున్నాం.

- యుగంధర్, జిల్లా కోఆర్డినేటర్, వనపర్తి

జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి

▸ పేద క్రీడాకారులకు ఉచిత శిక్షణ
▸ హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బసవరాజ్
▸ విజేతలకు బహుమతులు ప్రధానం



అండర్-23 విజేత మహబూబ్‌నగర్ బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బసవరాజ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తామని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) జాయింట్ సెక్రటరీ బసవరాజ్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-19, 23 పురుషులు, అండర్-25 మహిళల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బసవరాజ్, ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలోనే సొంత మైదానాలు ఉన్నాయని గుర్తు చేశారు.

హెసీఏ ఆధ్వర్యంలో పేద క్రీడాకారులకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, పలువురు యువతీ యువకులు క్రికెట్‌లో రాణిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ఎండీసీఏ స్టేడియాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్ సింగ్ మాట్లాడుతూ యువతులు క్రికెట్‌లో రాణించాలన్నారు.

అనంతరం వేసవి శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు మన్నాన్, ముఖ్తర్ పాల్గొన్నారు.

మహిళా టోర్నీ విజేత రెడ్ జట్టు

▸ 6 వికెట్ల తేడాతో పింక్ జట్టుపై విజయం
▸ అర్ధ సెంచరీతో రాణించిన ప్రతీక


అర్ధసెంచరీ(68)తో రాణించిన ప్రతీక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-25 ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ టోర్నీలో రెడ్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లో పింక్ జట్టు మొదట బ్యాటింగ్ చేసింది.

25 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. చంద్రకళ 33, శైలు 9 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఇందు 14, కవిత 12, మేఘన 10 పరుగులు సాధించారు. రెడ్ జట్టు బౌలర్లలో మహేశ్వరి 2, సింధూజ, అక్షర రాథోడ్, వైశాలి ఒక్కో వికెట్ తీశారు. లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన రెడ్ జట్టు 20.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసి విజయం సాధించింది. వరుసగా రెండు మ్యాచ్‌లలో గెలుపొంది రెడ్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. జట్టులో ప్రతీక 64 బంతుల్లో 8 ఫోర్లతో అర్ధ సెంచరీ (68) పరుగులు చేసింది. ఎం.సింధుజ 13, వైశాలి 15 పరుగులు చేసింది.

పింక్ జట్టులో మేఘనాగౌడ్, పవిత్ర, నిహారిక ఒక్కో వికెట్ తీశారు. విజేత జట్టును ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్ అభినందించారు.

తల్లిదండ్రులపై అలిగి.. ఇంట్లోంచి వెళ్లిపోయిన యువతి

▸ పోలీసులకు ఫిర్యాదు

అచ్చంపేట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భర్త విషయమై తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగిన ఓ యువతి, వారు మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం బక్కలింగయ్యపల్లి గ్రామానికి చెందిన రాత్లావత్ మోతీలాల్ రెండో కుమార్తె రాత్లావత్ శిరీష (20)కు ముదావత్ నవీన్(26)తో 18 నెలల క్రితం వివాహం జరిగింది. నెల క్రితం ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడి గ్రామ పెద్దల సమక్షంలో విడిపోయారు. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ఇదే విషయమై సోమవారం రాత్రి ఆమె తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగడంతో వారు తీవ్రంగా మందలించారు. దీంతో ఆమె అలిగి రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది.

తల్లిదండ్రులు ఆమె కోసం రాత్రంతా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయంపై తండ్రి మోతీలాల్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం సేకరణలో రికార్డు బ్రేక్

▸ గత ఏడాది యాసంగి కంటే రెండింతలు


వనపర్తి మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేస్తున్న నిర్వాహకులు

వనపర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ధాన్యం సేకరణలో రికార్డును బ్రేక్ చేసింది. గతేడాది యాసంగితో పోలిస్తే ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో వరి సాగు చేయడంతో దిగుబడి కూడా పెరిగింది. గత యాసంగి సీజన్‌లో 92వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే, ఈ ఏడాది ఇప్పటికే 2 లక్షల 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇంకా పలు మండలాల్లో ధాన్యం కల్లాల్లోనే ఉంది. ఇంకా సుమారు 200 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధి కారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న కొనుగోళ్లు..

గత ఏడాది యాసంగి సీజన్‌లో 92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 2 లక్షల 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకోవడంతో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 379 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికే 300 కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. ఇంకా 79 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరిస్తున్నారు. మరో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వారం రోజులలో మిగతా కొనుగోలు కేంద్రాలను కూడా మూసివేయనున్నట్లు సమాచారం.

40 వేల మంది రైతుల ఖాతాలో నగదు జమ

జిల్లా వ్యాప్తంగా సేకరించిన ధాన్యానికి ఇప్పటి వరకు 40వేల మంది రైతులకు గాను రూ.504 కోట్లు వారి ఖాతాలో జమ చేశారు. మిగతా 3004 మంది రైతులకు గాను రూ.97 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరికి కూడా ట్యాబ్ ఎంట్రీతో పాటు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే వారి ఖాతాలో డబ్బు జమ కానుంది. కానీ ధాన్యం విక్రయించి రెండు నెలలు అవుతున్నా బోనస్ రూ.500 జమ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ముందస్తుగా రావడంతో వానకాలం సాగు పనులు ప్రారంభమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ త్వరగా చెల్లిస్తే పంట పెట్టుబడికి తోడవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అమాత్యుల ప్రస్థానం జడ్పీటీసీ నుంచి..

▸ అంచెలంచెలుగా ఎదిగిన పాలమూరు నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డి


వాకిటి శ్రీహరి

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు నాయకులు అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరారు. నాడు జడ్పీటీసీ సభ్యులుగా పని చేసిన వారు నేడు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా అధికార పీఠాలను అలంకరించారు. మరి కొందరు శాసన సభ్యులుగా ఉన్నారు.

● గతంలో మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత కొడంగల్ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు.

● మక్తల్ నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న వాకిటి శ్రీహరి, తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తాజాగా ఆయనను మంత్రి పదవి వరించింది.

● గత ప్రభుత్వ హయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావు, ప్రస్తుత మంత్రి వర్గంలోనూ మంత్రిగా కొనసాగుతున్నారు.


డీకే అరుణ

● ప్రస్తుత పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ కూడా గతంలో జడ్పీటీసీగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అంచెలంచెలుగా ఎదిగి అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం బీజేపీ తరఫున మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

● గతంలో జడ్పీటీసీ సభ్యులుగా ఉన్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

● దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో అమరచింత ఎమ్మెల్యేగా ఉన్న స్వర్ణా సుధాకర్‌రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూత్పూర్ జడ్పీటీసీ సభ్యురాలిగా విజయం సాధించి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

● గతంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన సీతా దయాకర్‌రెడ్డి, ఆ తర్వాత దేవరకద్ర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

● షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కూడా మొదట కేశంపేట జడ్పీటీసీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఇలా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు జడ్పీటీసీ సభ్యులుగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఉన్నత స్థాయికి ఎదిగి సత్తా చాటుకున్నారు.

'వివరాలు నమోదు చేసుకోవాలి'

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడా సంఘాల వివరాలను నమోదు చేసుకోవాలని ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. క్రీడా సంఘం రిజిస్ట్రేషన్, రాష్ట్ర గుర్తింపు పత్రం, చివరి ఎన్నిక నిర్వహించిన సంవత్సరం, కాలపరిమితి, ఎన్నికల అధికారి ఇచ్చిన ధ్రువపత్రాలను క్రీడాశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు.

తరుగు దగా..

- మిల్లర్ల ఇష్టారాజ్యం..
- రైతులను మోసం చేస్తున్న రైస్‌మిల్ యాజమాన్యం

పాన్‌గల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ క్షేత్రస్థాయిలో తరుగు పేరుతో రైతులను రైస్ మిల్ యాజమాన్యం మోసం చేస్తున్నారని అలాగే రైతులతో సెటిల్‌మెంట్లకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మమ్మల్ని ఆదుకునేది ఎవరు.. పట్టించుకునేది ఎవరు అంటూ వెంగలాయిపల్లి గ్రామ రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని కేతేపల్లిలోని మొహరిన్ రైస్‌మిల్‌కు 7 రోజుల కిందట మండలంలోని వెంగలాయిపల్లికి చెందిన ఆరుగురు రైతులు 713 బస్తాలను రైస్‌మిల్‌కు పంపారు. కానీ అక్కడ రైస్ మిల్ యాజమాన్యం తేమ శాతం ఎక్కువగా ఉందని, మ్యాచర్ రావడం లేదని నాలుగు రోజులు లారీని అన్‌లోడ్ చేయకుండా అలానే వదిలేశాడు. రైతులను పిలుచుకొని తేమ శాతం, తరుగు పేరుతో 40 కిలోలకు రెండు కిలోల చొప్పున క్వింటాల్‌కు ఐదు కిలోల తరుగు తీస్తామని, అలా తీస్తేనే.. అన్‌లోడ్ చేస్తామని రైతులతో యాజమాన్యం తెలియజేశారు. ఈ విషయంపై జిల్లా ఉన్నత అధికారి దృష్టికి తీసుకెళ్లగా.. ఇద్దరు నష్టపోకుండా చూసుకోవాలని సలహాలు ఇస్తున్నారే తప్పా చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. డీఎంతో పరిశీలన చేపిస్తానని తెలియజేశారు.


రైతులతో మాట్లాడుతున్న రైస్‌మిల్ సిబ్బంది (ఫైల్)

మాకు న్యాయం చేయాలి



మావి 60 బస్తాలు, మ్యాచర్ 16 వచ్చింది. అందరితో పాటు మావి కూడా కట్ చేశారు. క్వింటాకు ఎన్ని కిలోలు తీసుకుంటున్నారో కూడా రైతులకు స్పష్టంగా చెప్పడం లేదు. రైతులను నిలువునా ముంచుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలి.

- మల్లెపు బాలస్వామి, రైతు, వెంగలాయిపల్లి

భూ భారతితో సమస్యలు పరిష్కారం


శాఖాపురంలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంతో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం మండలంలో శాఖాపురంలో రెవెన్యూ సదస్సులో పాల్గొని, కంచిరావుపల్లిల్లో రైతునేస్తం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని ముందుగానే దండోర వేయించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలు ఉన్న రైతులు అందరు కలిసి పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకుంటే నెల లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూ సమ్యలు ఉన్న రైతులు నేరుగా అధికారుల వద్దకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కంచిరావుపల్లిలో మహేశ్వర ట్రేడర్స్‌లో విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీటీ నందకిషోర్, ఏవో షేక్ మున్న, ఆర్ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై కలిసికట్టుగా ఉద్యమిద్దాం


మహాసభలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్ల రాజు, పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా 4వ మహాసభలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. రెండో పీఆర్‌సీ పరిధిలోకి గ్రామపంచాయతీ సిబ్బందిని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొబ్బిలి నిక్సన్, రమేష్, రాము, పుష్ప, హనీస్, శ్రీను, చందు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ జిల్లా కార్యవర్గం ఎన్నిక...

సీఐటీయూ జిల్లా 4వ మహాసభలో జిల్లా అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా శారద, ప్రధాన కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా రాధా, ఉపాధ్యక్షురాలిగా నారాయణమ్మ, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, విజయ, రమాదేవిలతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నందిమల్ల యాదయ్యకు సన్మానం

వనపర్తి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనపర్తి పట్టణానికి చెం దిన నందిమల్ల యాదయ్య నియమితులయ్యారు. వనపర్తి పట్టణానికి చెందిన నందిమల్ల యాదయ్య 1999లో చిన్నారెడ్డి సమక్షంలో వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాటి నుంచి నేటి వరకు చిన్నారెడ్డికి అనుచరుడిగా గుర్తింపు పొందాడు. జేపీసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పని చేసిన ఆయనను తాజాగా రాష్ట్ర టీపీసీసీ ప్రకటించిన జాబితాలో రా ష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మంగళవారం నందిమల్ల యాదయ్యను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రజా భవన్‌లో శాలువాతో ఘనంగా సన్మా నించారు.

కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, చీర్ల జనార్దన్, అబ్దుల్లా, విజయ్‌బాబు, పెంటయ్య, రాము, భాస్కర్ తదితరులు యాదయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత

శ్రీరంగాపూర్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాటిపాములలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని డీపీఎం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా తాటిపాముల యూపీ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. రామచంద్రయ్య, శ్రీనివాసులు, రాములుయాదవ్ పాల్గొన్నారు.

ప్రమాదంలో స్వేచ్ఛా ప్రజాస్వామ్యం


మహాసభల్లో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

వనపర్తి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : దేశంలో, రాష్ట్రంలో జర్నలిస్టుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని, అందులోనూ జర్నలిస్టుల ఐక్యత ప్రశ్నార్థకంగా మారుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్‌జీవో సమావేశ భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మూడో మహాసభలు అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అశోక్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామని తెలిపారు. రామకృష్ణ, మాణిక్ ప్రభు, పరిపూర్ణం, రామచందర్, రమేష్, పూరి సురేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ వనపర్తి జిల్లా కార్యవర్గాన్ని మహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకుల సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.సురేందర్ గౌడ్, వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా చారగొండ బాబు, బక్కి బాబు నాగభూషణం, కోశాధికారిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వికలాంగులు హెచ్‌టీటీపీఎస్: //టీజీవోబీఎంఎం ఎస్.సీజీజీ. జీవోవి.ఇన్ ద్వారా తమ దరఖాస్తులు ఈ నెల 7వ తేదీ నుంచి 18వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతీ దరఖాస్తుదారుడికి ఒక సదుపాయ ఉపకరణం మాత్రమే మంజూరు చేస్తారన్నారు. ఈ ఏడాది వనపర్తి జిల్లాకు 40 రిట్రోఫిటెడ్ స్కూటీలు, 12 బాటరీమినీ ట్రేడింగ్ ఆటో వెహికల్, 4 హైబ్రిడ్ వీల్ చైర్లు, 20 లాప్‌టాప్స్, 10 టాబ్స్, 2 5జి స్మార్ట్‌ఫోన్స్, 20 చేతి కర్రలు, 5 వీల్ చైర్స్, 2 చెవిటి మెషిన్, 5 ట్రై సైకిల్, 10 స్మార్ట్ కేన్స్, 72 ఎంసీఆర్ చప్పాల్ పంపిణీ కోసం కేటాయించినట్లు వివరించారు.

అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు

వనపర్తి విద్యావిభాగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయబోతున్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేస్తు పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి నడిబొడ్డున ఉన్న బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు అధునాతన హంగులతో నూతన భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు 40 శాతం డైట్ ఛార్జీలను పెంచడం, కేజీబీవీ పాఠశాలలు బాలికల విద్యాభివృద్ధికి బాసటగా నిలవడం, పాఠశాల ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేసి విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటును అందిస్తుందన్నారు.

జన జీవన స్రవంతిలో కలవాలి

వనపర్తి విద్యావిభాగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నక్సలైట్లు జన జీవన స్రవంతిలో కలవాలి అనే నినాదంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం ద్వారా సమస్యలకు పరిష్కారం సాధ్యమని, హింసమార్గంలో దేశంలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్, కార్తీక్, బంటి, పవన్, వెంకీ, భాస్కర్, వినయ్ పాల్గొన్నారు.

చెరువు తూం పనులకు భూమిపూజ

కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమడబాకులకి చెందిన ఊర చెరువు తూం నిర్మాణానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రూ.7.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం తూం పనులకు మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ ఇరిగేషన్ అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. బీమపల్లి యాదవ్, సత్యారెడ్డి, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేంద్రాచారి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

వృద్ధులకు చేతి కర్రల అందజేత

కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామనంతపూర్‌కి చెందిన మహేష్ కనిమెట్ట గ్రామంలోని వృద్ధులకు ఉపయోగపడే స్టాండ్స్, చేతి కర్రలును మంగళవారం అందజేశారు. ఆ తర్వాత తన 32వ జన్మదిన వేడుకలను జరుపుకున్నాడు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహ, పరమేష్, బాలరాజు, యాదగిరి తదితరులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లికి చెందిన మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను అనుచరులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కొత్తకోటలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీనివాసులు, శాంతన్న, శేఖర్‌గౌడ్, దనుష్, రవీందర్‌గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


వెంకటయ్యకు వినతి అందజేస్తున్న భరత్

కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్, మాజీ కౌన్సిలర్ భరత్ భూషణ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కా వెంకటయ్యకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం వెంకటయ్య జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో కలిసినట్లు తెలిపారు. ఆడిటోరియం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటి 30 లక్షలు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ మార్పిడి అనంతరం పనులు జరగడం లేదని వివరించారు. వెంటనే పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు.

మంత్రి శ్రీహరి ఆధ్వర్యంలో అభివృద్ధి

అమరచింత, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నూతన మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో తమ మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్, మండల, పట్టణ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం తమ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఆలయంలో లక్ష పుష్పార్చన

కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లిలోని సుప్రసిద్ధమైన శైవక్షేత్రం కోటిలింగేశ్వరస్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయంలోని సర్వదేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ధర్మకర్త మహేశ్వర్, శేఖరయ్య, విశ్వనాథం అన్నప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

ఖిల్లాఘణపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమలొద్దిన్పూర్‌లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జయాకర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి రూ.25 వేలు చెక్కు రూపంలో ఆర్థిక సాయం ఎస్ఐ సురేష్ గౌడ్‌కు అందజేశారు. ప్రతీ చౌరస్తాలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి నేరాలను నియంత్రించాలని కోరారు. ఎస్ఐ సురేష్ గౌడ్, మర్యాద రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పెబ్బేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు ఐక్య ఉద్యమాల ద్వారానే కాపాడుకోవాలని రైసువిల్లు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో మంగళవారం టీయూసీఐ ప్రథమ మహాసభలు వాలుపోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, జిల్లా అధ్యక్ష, కార్యదుర్శులు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.

వీపనగండ్ల : మండల కేంద్రంలో మంగళవారం టీయుసీఐ ప్రథమ జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 11న మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ మండల అధ్యక్షుడు వెంకటయ్య కోరారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

పెబ్బేరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చని మునిసిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం 2వ వార్డులో డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. యోగేష్ కుమార్, ప్రశాంత్, మహేష్, ఉమావతి, బాలీశ్వర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం

శ్రీరంగాపూర్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కంభళాపూర్‌లో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఇన్‌చార్జి రాఘవేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి గరీబ్ యోజన కింద మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి అందిస్తుందని అన్నారు. అనంతరం 12 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి, నిజాముద్దిన్, రమేష్ పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురం, : కేంద్ర ప్రభుత్వ పథకాలే దేశానికి శ్రీరామరక్ష అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బిశ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు.

తలుపునూరులో భూ భారతి..

రేవల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తలుపునూరులో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐ శంకర్, రెవెన్యూ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన విద్యార్థులు


పెద్దమందడిలో మాట్లాడుతున్న వరప్రసాద్‌రావు

పెద్దమందడి, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతో పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యకరమైన విద్యార్థులు తయారవుతారని మోజర్ల, మద్దిగట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని మధ్యాహ్న భోజనం చేసే వంట ఏజెన్సీ సభ్యులకు పరిశుభ్రతతో వంట విధానంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశుభ్రతతో నాణ్యమైన వంట చేసి వడ్డించాలని సూచించారు. ఏ.భగవంతు, ఎ.వెంకటస్వామి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వంట సహాయకులు పాల్గొన్నారు.

వంట మనుషులకు శిక్షణ

వనపర్తి విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 సంవత్సరంలో అమలు కాబోతున్న నూతన ఆహార పట్టిక తయారీ విధానంపై కస్తూర్బాలో పని చేస్తున్న వంట మనుషులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు.

పరిశుభ్రత బాధ్యతగా భావించాలి

పెబ్బేరు : ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై బాధ్యతగా భావించాలని ఎంఈవో జయరాములు సూచించారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఎంఆర్‌సీ భవనంలో పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో విద్యార్థుల అనారోగ్యాల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రవికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


పెబ్బేరులో అవగాహన కల్పిస్తున్న ఎం.ఈ.వో

పట్టణ ప్రణాళికలో భాగస్వాములు కావాలి


డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని వనపర్తి మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రణాళిక నిర్వహిస్తున్నామని, ఇళ్లలో వెలువడే చెత్తను తడి, పొడి వేర్వేరుగా చేసి మునిసిపల్ వాహనాలకు అందించాలన్నారు. అనంతరం 100 రోజుల ప్రణాళికపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్పీలు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎం.ఆర్. సునీత

వనపర్తి లీగల్ కాంట్రిబ్యూటర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. మంగళవారం జిల్లాలోని జిల్లా న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సఖి కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల కార్మికుల చట్టం బాల్య వివాహాల చట్టం, మోటార్ వెహికల్ చట్టం, క్రైమ్ గురించి వివరించారు. సఖి కేంద్రం ఇన్‌చార్జి కవిత, ఉత్తరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

ఈ నెల 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ పై కక్షిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రజా పరిసరాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార వ్యాప్తి కోసం జాతీయ లోక్ అదాలత్ వాల్‌పోస్టర్‌ను జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్.సునీత విడుదల చేశారు. వి.రజని, కళార్చన, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సులను సీజ్ చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఫిట్నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సులను సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీటీవో కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీవో వాసుదేవరావును కలిసిన నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలెం శాస్త్రవేత్త రామ్‌రెడ్డి

వనపర్తి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడిలపై అవగామన పెంచుకుని దిగుబడి పొందాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెం శాస్త్రవేత్త రామ్‌రెడ్డి, విజయలక్ష్మి, రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం రైతు వేదికలో అన్నదాతలకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వెటర్నరీ డా.రాజేష్ ఖన్నా, కురుమయ్య, శివతేజ, కవిత పాల్గొన్నారు.

లాభాలు వచ్చే పంటలను సాగు చేసుకోవాలి


గుమ్మడం తండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెబ్బేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో లాభాలు వచ్చే పంటలను సాగుచేసుకోవాలని కేవీకే శాస్త్రవే అనిత రైతలకు సూచించారు. మంగళవారం మండలంలోని యాపర్ల, గుమ్మడంతాండ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ.. భూసార పరీక్షలు చేసుకోవడంతో ఎరువుల ప్రాధాన్యతంగా వాడుకోవడం జరుగుతుందన్నారు. నూతన పంటల ఉపయోగంపై రైతులకు వివరించి ప్రోత్సహించారు. డాక్టర్ శాంతలక్ష్మి, పశువైద్యా అధికరారి విజయ్, హెచ్‌ఈవో కృష్ణయ్య పాల్గొన్నారు.

సహజ ఎరువులు పంటకు జీవం

గోపాల్‌పేట : రైతులు సహజంగా తాను తయారు చేసుకునే ఎరువులు పంటకు జీవమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మున్నూరు గ్రామంలో వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు వానకాలంలో పంటకు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు ప్రభుత్వ సబ్సిడీలపై మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు.